క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ఐటీఐ ఎదురుగా ఉన్న పాత జూనియర్ కాలేజీ భవనంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సాయిసంజీవిని కిడ్నీ స్టోన్ మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరంలో యూరాలజీ, కిడ్నీ, ప్రొస్టేట్ సమస్యలు, గైనిక్ సమస్యలు, అపెండిక్స్, హెర్నియా, పైల్స్, ఫిస్టులా, థైరాయిడ్ తదితర వ్యాధులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: కార్తీకమాసం పురస్కరించుకుని సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండకు రెండు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 5గంటకు, 6.30గంటలకు మదనపల్లె నుంచి మల్లయ్యకొండకు బయలుదేరుతాయన్నారు. అక్కడి నుంచి రాగిమాను సర్కిల్ నుంచి సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు తిరుగుతాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో యువతి ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. తెట్టు పంచాయతీ శ్రీరాములవారిపల్లెకు చెందిన యువతి (17) మదనపల్లెలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఇటీవల కళాశాలలో నిర్వహించిన పరీక్షల్లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కేశాలు దానం



కేశాలు దానం చేస్తున్న విద్యార్థిని అనన్య

మదనపల్లె సిటీ: క్యాన్సర్ బాధితులకు మానసికంగా తోడుగా నిలవాలని హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మదనపల్లెకు చెందిన గోపాలకృష్ణ, అరుణ దంపతుల కుమార్తె అనన్య కేశాలు దానం చేశారు. స్థానిక హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో విద్యార్థినికి పూల మొక్క అందజేసి అభినందించారు. క్యాన్సర్ బాధితులైన ఐదుగురికి ఉచితంగా విగ్గులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కిరణ్, గుణ పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్‌కు నివాళి

బి.కొత్తకోట: తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ జయంతి సందర్భంగా ఆదివారం బి.కొత్తకోటలో వాకర్స్ నివాళులర్పించారు. తెలుగు సాహిత్యానికి విశేష సేవలు అందించడమేకాక వేమన పద్యాలను సేకరించి వాటిని ప్రచురించారని, ఆంగ్లంలోనూ అనువదించారని కొనియాడారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వంక హరినాథరెడ్డి, సుబ్బిరెడ్డి, బద్రినాథ్, వాకా హరినాథరెడ్డి, కాంతు, ఓలేటీ ప్రసాద్, నందన్, సాయిరాం పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై సందర్శకుల రద్దీ



అటవీప్రాంగణంలో సందర్శకులు

బి.కొత్తకోట: పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం సందర్శకులతో రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో కొండపై సందడి వాతావరణం కనిపించింది. కర్ణాటక, తమిళనాడు, వైఎస్సార్‌జిల్లా, స్థానిక పర్యాటకులు సందర్శనకు విచ్చేశారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని బసినికొండ నగరవనం వద్ద సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బసినికొండకు చెందిన ఎం.సత్యనారాయణ కుమారుడు ఎం.గౌతమ్ (38) ఒక్కొక్కటి 250 ఎం.ఎల్.సారా కలిగిన 80 ప్యాకెట్లు, ప్లాస్టిక్ సంచిలో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు.

శ్రీవారి భక్తులకు ఆశ్రయం

పెద్దతిప్పసముద్రం: కర్నాటక రాష్ట్రం తుముకూర్ జిల్లా పావగడకు చెందిన 150 మంది శ్రీవారి భక్తులు కాలి నడకన తిరుపతికి బయలు దేరారు. ఆదివారం సదరు భక్తులు మండలంలోని పోతుపేటకు చేరుకున్నారు. గ్రామానికి చెందిన కోట్లోని చినపరెడ్డి, వెంకటరమణమ్మ జ్ఞాపకార్థం భక్తులకు కోట్లోని నాగరాజు, భవానీ భోజనంతో పాటు వారికి వసతి సౌకర్యం కల్పించారు.

నిర్వహణ బరువై.. నీడ కరువై..

- వాహనాలు ఢీకొనడంతో దెబ్బతిన్న బస్‌షెల్టర్లు
- మరమ్మతులకు నోచుకోక ప్రయాణికుల ఇబ్బందులు
- దళారుల పాలవుతున్న నష్టపరిహారం



తలారివాండ్లపల్లె క్రాస్‌వద్ద వాహనం ఢీకొనడంతో ఆనవాళ్లు లేకుండాపోయిన బస్‌షెల్టర్

గుర్రంకొండ: రాజంపేట ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి, ఎన్‌హెచ్ 340 వారి లక్షలాది రుపాయల నిధులు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్లు ధ్వంసం అవుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి బస్‌షెల్టర్లను ఢీకొంటున్నాయి. దీంతో బస్‌షెల్టర్లు పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో ప్రయాణీకులకు నిలువనీడ లేక ఇబ్బందులు పడుతున్నాయి. వాహనాల యజమానుల దగ్గర దళారులు నష్టపరిహారం వసూలు చేసుకొని జేబులు నింపుకొంటున్నారు. కనీసం బస్‌షెల్టర్లకు మరమ్మతులు చేయిస్తే ప్రజలకు, ప్రయాణీకులకు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

ధ్వంసమైన బస్‌షెల్టర్

గుర్రంకొండ–వాల్మీకిపురం మార్గంలోని తలారివాండ్లపల్లె క్రాస్ వద్ద రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అభివృద్ధి నిధులతో బస్‌షెల్టర్ నిర్మించారు. ఐదు గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు చేరుకోవాలంటే తలారివాండ్లపల్లె క్రాస్‌వద్దకు చేరుకోవాల్సిందే. మండుటెండకు, వర్షాలకు నిలువనీడలేక ప్రజలు ఇబ్బంది పడేవారు. నాలుగేళ్ల క్రితం ఎంపీ నిధులతో ఇక్కడ బస్‌షెల్టర్ నిర్మించారు. నిర్మించిన ఏడాదికే లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో బస్‌షెల్టర్ పూర్తిగా ధ్వంసమైంది. ఈ సంఘటనపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిహారం మంజూరు చేశారు. కానీ ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు.

గుర్రంకొండలో దెబ్బతిన్న బస్‌షెల్టర్

గుర్రంకొండ పట్టణానికి సమీపంలో ఇందిరమ్మ కాలనీ వద్ద ఎన్‌హెచ్ 340 నిధులతో ఏడాది కిందట బస్‌షెల్టర్ నిర్మించారు. ఇందిరమ్మ కాలనీలో సుమారు 900 ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతినిత్యం వందలాది మంది ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆరునెలల కిందట ఓ సిమెంటు లారీ బస్‌షెల్టర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో సగం బస్‌షెల్టర్ దెబ్బతింది. పై కప్పుకుడా దెబ్బతినడంతో నిరుపయోగంగా మారింది. దీంతో బస్‌షెల్టర్ వైపు వెళ్లాంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు.

ప్రజలకు అవస్థలు

మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దిగువతొట్లివారిపల్లె క్రాస్ వద్ద ఎంపీ అభివృద్ధి నిధులతో గతంలో ఇక్కడ బస్‌షెల్టర్ నిర్మించారు. ఐదు గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి ఇక్కడి చేరుకొంటారు. ఈ బస్‌షెల్టర్ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. రెండునెలల క్రితం ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో సగం బస్‌షెల్టర్ దెబ్బతింది. ఓవైపు గోడలు, పైకప్పు దెబ్బతిన్నాయి. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇంతవరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

దళారుల పాలైన నష్టపరిహారం

తలారివాండ్లపల్లె క్రాస్ వద్ద వాహనం బస్‌షెల్టర్ ఢీకొన్న సంఘటనపై కొంతమంది నాయకులు రంగప్రవేశం చేశారు. వాహన యజమానితో రాజీ కుదుర్చుకొని తాము మరమ్మతు చేయిస్తాని నమ్మబలికి నష్టపరిహారం వసూలు చేసుకొన్నారు. అయితే ఇంతవరకు మరమ్మతు చేయించలేదు. గుర్రంకొండ ఇందిరమ్మకాలనీ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ను సిమెంటు లారీ ఢీకొన్న సంఘటనలో కొంత మంది దళారులు జోక్యం చేసుకొని సదరు వాహనాదారుడి దగ్గర నష్టపరిహారం వసూలు చేసుకొని జేబులు నింపుకొన్నారు. దిగువతొట్లివారిపల్లె వద్ద బస్‌షెల్టర్ ను వాహనం ఢీకొన్న ఘటనలోనూ దళారులు పంచాయితీ చేసి నష్టపరిహారం కింద డబ్బులు వసూలు చేసుకున్నారు.



దిగువతొట్లివారిపల్లె వద్ద లారీ దూసుకెళ్లడంతో దెబ్బతిన్న బస్‌షెల్టర్

విచారణ జరిపిస్తాం



మూడు బస్‌షెల్టర్లు ధ్వంసం చేసిన సంఘటనల్లో బాధ్యులను విచారిస్తాం. దిగువతొట్లివారిపల్లె బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేయిస్తామని గ్రామపెద్దలు చెప్పారు. మిగిలిన రెండు బస్‌షెల్టర్ల ధ్వంసంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొంటాం.

– మధురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ

హామీల అమలులో కూటమి సర్కార్ విఫలం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ కొత్తపల్లెలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను విస్మరించిందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటంగా ప్రచారం చేసిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలు వైఫల్యం చెందారని తెలిపారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తూ అభివృద్ధిని విస్మరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉపాధిహామీ పథకం నిధులతో అరకొర సిమెంట్ రోడ్లు మంజూరూ తప్ప గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని తెలిపారు.

పరామర్శ

కేవీపల్లె మండలం గోరంట్లపల్లి పంచాయతీ యర్రదొడ్డిగారిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభరెడ్డి భార్య పద్మిని (గుణసుందరి) ఉత్తరక్రియల కార్యక్రమానికి హాజరై వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కలకడ మండలం నడిమిచెర్ల పంచాయతీ కొత్తపల్లె గ్రామానికి చెందిన అరమాటి రంగారెడ్డి దంపతుల కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి వివాహంలో పాల్గొన్నారు. అనంతరం మదనపల్లెలోని సంఘం ఫక్షన్ హాల్‌లో గుర్రంకొండ మండలం దిగువబురుజుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి కుమార్తె హితైషి నిచ్చితార్థ కార్యక్రమంలో పాల్గొని కాబోయే వదూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లమ్మ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, బాబురెడ్డి, శ్రీనివాసులుఆచారి, శ్రీనివాసులురెడ్డి, రమణ, నవీన్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, నాగభూషన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వరనాయుడు, నాగరాజానాయుడు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు



సీపీఎం ప్రజాపోరు కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మదనపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం చేపట్టిన ప్రజాపోరు ఆదివారం ప్రారంభమైంది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లి ప్రాంతంలో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పి. శ్రీనివాసులు మాట్లాడుతూ అధిక ధరలను నియంత్రించి, నిత్యావసర ధరలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ జమిలి ఎన్నికలు తీసుకురావాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేనని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటి మాత్రమే అమలు చేసి మిగతా వాటి గురించి మాట్లాడడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి. హరిశర్మ, పి.నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

టిప్పుసుల్తాన్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు



టిప్పుసుల్తాన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బాస్ నాయకులు

మదనపల్లె : టిప్పుసుల్తాన్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపకుడు పీటీఎం.శివప్రసాద్ కొనియాడారు. టిప్పుసుల్తాన్ జయంతిని పురస్కరించుకుని బాస్ రాష్ట్ర నేత టి.ఏ.పీర్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని బెంగళూరు బస్టాండ్‌లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిప్పుసుల్తాన్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీటీఎం. శివప్రసాద్ మాట్లాడుతూ టిప్పుసుల్తాన్ బ్రిటీషర్లతో పోరాడుతూ ప్రాణాలు వదిలాడన్నారు. ప్రపంచంలో తొలి యుద్ధ రాకెట్‌కు రూపకల్పన చేసిన ఘనత టిప్పుసుల్తాన్‌కే దక్కుతుందని ప్రశంసించారు. మైసూర్ పట్టుపరిశ్రమ స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. అనేక ఆలయాలు నిర్మించి మత సామరస్యాన్ని చాటారన్నారు. మొదటి స్వాతంత్ర్య సమరయోధుడైన టిప్పుసుల్తాన్ వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలను పాఠ్యాంశాల్లో చేర్చి పాలకులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షాహిద్‌బేగ్, ముదస్సిర్, మన్సూర్, అస్లాం, ఇమ్రాన్, బాస్ నాయకులు ముత్యాలమోహన్, నీరుగట్టిరమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న చెవిరెడ్డి కుటుంబసభ్యులు

పీలేరురూరల్ : తిరుపతి జిల్లా పాకాల మండలం దామలచెరువుకు చెందిన వైసీపీ నాయకురాలు హసీనా, అహ్మద్‌బాషా కుమార్తె హారీషాకు వాసీఫ్‌తో స్థానిక ఎంఎం ఫంక్షన్ హాల్‌లో వివాహం జరిగింది. ఈ వివాహానికి రాష్ట్ర మాజీ మంత్రి ఆర్.కె. రోజా, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్, సతీమణి, కుమారులు చెవిరెడ్డిలక్ష్మీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అతిథులుగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీ రెడ్డెమ్మకొండ



శ్రీరెడ్డెమ్మతల్లి ఆలయంలో సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి సమీపంలోని దిగువతొట్లివారిపల్లెలో అమ్మవారికి అర్చకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించిన మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతోనే అమ్మవారి ముందు సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటకతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మదనపల్లె : పట్టణంలోని హోప్ హైస్కూల్‌లో పలమనేరుకు చెందిన వికేర్ ఐవీఎఫ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సయ్యద్‌ముబారక్, రతన్‌టాటా జ్ఞాపకార్థంగా నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్లు అంజుమన్నీసా, ఖలీలుల్లా శిబిరానికి హాజరైన 150 మంది పిల్లలు లేని దంపతులను పరీక్షించారు. పిల్లలు పుట్టేందుకు అవసరమైన వైద్యసలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు డాక్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

పీలేరు : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేసినట్లు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్ తెలిపారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం వైద్యులు సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరిశంకర్, సీఈఓ సీతారామనాయుడు తెలిపారు. 150 మందికి కంటి పరీక్షలు చేసి 60 మందికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 25 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సీఈఓ సీతారామనాయుడు, ట్రస్ట్ ఏఓ కృష్ణగల్లా పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కేవీపల్లె : మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ కుమ్మరపల్లె శ్రీ సాయికృప వృద్ధాశ్రమంలో వృద్ధులకు పీలేరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ వి. రామచంద్ర మాట్లాడుతూ వద్ధులకు వసతి, వైద్యం అందిస్తూ శ్రద్ధగా చూసుకుంటున్న ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు.

మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయండి

కలికిరి: మదనపల్లిలో ఈ నెల 14న ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో జరుగనున్న మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ దుద్దు రామకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతలతో కలిసి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆయన పోరాట పటిమ అనితరసాధ్యమని కొనియాడారు. ఎస్సీవర్గీకరణ కోసం తన ప్రణాలను కూడా లెక్కచేయలేదని తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగల జీవితాలు బాగుపడాయని తెలిపారు.కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు రవీంద్రమాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్నమాదిగ, నేతలు గడికోట వెంకటేష్, గురుప్రసాద్, వినోద్, వెంకటేష్, నాగయ్య పాల్గొన్నారు.

‘కనువిప్పు’ సందేశాత్మక లఘుచిత్రం

మదనపల్లె సిటీ: వృద్ధుల సమస్యలపై కనువిప్పు మంచి సందేశాత్మక లఘుచిత్రమని బీటీ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ వై.ఎస్.మునిరత్నం అన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో కనువిప్పు లఘచిత్రం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. వృద్ధులపై దాడులు, కన్న బిడ్డలు వారిని వదిలివెళ్లపోవడం వంటికి నిత్యం చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిజజీవతంలో జరిగే ఘటనలు ఆధారంగా చిత్రాన్ని నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి మంచి చిత్రాలు తీయాలని కోరారు. సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు ఎస్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ అతి కొద్ది కాలంలోనే 19 వేల మంది వీక్షించారన్నారు. అందరి మన్ననలు పొందినట్లు పేర్కొన్నారు. అనంతరం డైరెక్టర్ రాజు, కథా రచయిత టీఎస్‌పే కృష్ణమూర్తి, నటీనటులు గొల్లపూడి తిరుపతిరావు, ధనలక్ష్మి, నాగభూషణం, వెంకటరమణను ఘనంగా సన్మానించారు. సీనియర్ సీటిజెన్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజ, శ్రీనివాసులు, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

15న అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరురూరల్ : కార్తీక పౌర్ణమిని పురష్కరించుకుని ఈ నెల 15న అరుణాచలంకు పీలేరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీపో మేనేజర్ బి. కుమార్ తెలిపారు. 15న ఉదయం 6 గంటలకు పీలేరు నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతున్నామని చెప్పారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకోవాలని కోరారు. అలాగే స్థానిక బస్టాండ్ ఆవరణలో రిజర్వేషన్ కౌంటర్‌లో బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. రానూపోనూ టికెట్ రూ. 700 మాత్రమేనని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225679, 9014200628 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థి మృతిపై విచారణ జరపాలి

పీలేరురూరల్ : కేవీపల్లె మండలం గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థి రెడ్డిమోక్షిత్ మృతి సంఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, ప్రిన్సిపాల్, పీఈటీ నిర్లక్ష్యం కన్పిస్తోందని ఆరోపించారు. విద్యార్థి మృతి చెందిన విషయం తల్లిదండ్రులకు తెలియజేయడంలో జాప్యం చేయడం వెనక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. విద్యార్థి మృతిపై పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ, డీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మాదవ, సాయిసంపత్, నరేష్ పాల్గొన్నారు.

మిట్స్ విద్యార్థులకు అరుదైన అవకాశం

కురబలకోట: మదనపల్లె సమీపంలో అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ విద్యార్థులు సాయిచరణ్ రెడ్డి పోరెడ్డి, దేవిశ్రీ సంహిత కట్టముడి, జ్యోతి వెంకటరెడ్డి వెల్లెపాలెం, సిరిరెడ్డి నందిరెడ్డి అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఇన్నో వేషన్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం తెలిపారు. ఈ యూనివర్సిటీ హస్సోప్లాట్‌నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (డీస్కూల్) నిర్వహిస్తోందన్నారు. డిజైన్, సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యవస్థాపకతతో క్యాంపస్ ఎంగేజ్‌మెంట్‌ను పెంచడానికి విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 13 దేశాల్లోని 44 ఉన్నత విద్యా సంస్థల నుంచి 164 మంది యూనివర్సిటీ ఇన్నో వేషన్ ఫెలోలుగా పేరు పొందారని పేర్కొన్నారు. వీరిలో మిట్స్ కళాశాల నుండి నలుగురు ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

పచ్చదనం కనుమరుగు



వారం క్రితం పచ్చదనంతో కళకళలాడిన సీటీఎం రోడ్డు



చెట్ల నరికివేతతో సీటీఎం రోడ్డులో కనుమరుగైన పచ్చదనం

మదనపల్లె: ఆ రహదారి పక్కన వందల ఏళ్లుగా పెద్ద పెద్ద వృక్షాలు ఉన్నాయి. బాగా విస్తరించి బాటసారులకు నీడనిచ్చేవి. అక్కడ అనేక మంది సేద తీరేవారు ఆ వృక్షాల గురించి గొప్పగా చెప్పుకోనేవారు. నీడ, ప్రాణవాయువునూ నిరంతరం విడుదల చేస్తూ ఆ వృక్షాలు జీవకోటికి గొప్ప మేలు చేస్తున్నాయి. వృక్షాలను దేవతలుగా పూజిస్తారు. అయితే పచ్చదనాన్ని కాపాడాల్సిన అధికారులే చెట్లను నరికివేస్తున్నారు. మదనపల్లె గ్రీన్‌బెల్ట్‌గా పేరుపొందిన సీటీఎం రోడ్డులో వందల ఏళ్ల నాటి వృక్షాలు, అభివృద్ధి పేరుతో నరికివేయడంపై ప్రకృతి ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. పచ్చదనంతో కళకళలాడుతున్న సీటీఎం రోడ్డును గుర్తు చేసుకుంటూ.. మళ్లీ ఇలాంటి పచ్చదనం పట్టణంలో చూస్తామా? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా మదనపల్లెకు సంబంధించిన సామాజిక మాధ్యమాల్లో సీటీఎం రోడ్డులో చెట్ల నరికివేతకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి.